# బోణీ బేరం

రహదారి వైపు ఆశగా చూసాడు ఈరిగాడు. మనుషులు వస్తున్న జాడ మచ్చుకైనా కన్పించలేదు. నల్లని తారురోడ్డు ముద్దకట్టిన ఆ రాత్రిపూట చీకట్లో నక్షత్రాల చిరు వెలుగులో ఇంకా నల్లగా కన్పిస్తున్నది.

"ఏలెంతై ఉంటదో?" ఆవలించి చిటిక వేసి, ఆకాశం వైపు చూస్తూ అనుకొన్నాడు.

నిలిచి నిలిచి వాడి కాళ్లు నొప్పి పెడ్తున్నాయి. చూసి చూసి వాడి కళ్లు పీకుతున్నాయి. నిద్ర ఎరగని ఒళ్లు జోగుతున్నది.

"ఈ రోజేటయింది? ఒక్కడంటే ఒక్క మనిసైనా ఇటు రాడేంటి? ఇంత పెద్ద పట్టం గొడ్డోయిందా?" చికాకుగా బుర్ర గోక్కున్నాడు. ఆరిపోయిన చుట్ట వెలిగించుకొని గట్టిగా ఒక దమ్ము లాగాడు. ఇంక అలా నిలిచేశక్తి లేక పక్కగా ఉన్న రాతి మీద చతికిలబడ్డాడు.

అక్కడికి దారి కన్పిస్తూనే ఉంది. ఎరమింగి అడవి మధ్య నిద్రకి జోగిన కొండ చిలవలా ఉంది. దారికి ఇటు అటు పహరావాళ్లలా నిలిచి ఉన్నాయి మద్దిచెట్లు. దగ్గరగా ఉన్న ఒక చెట్టు మీద వికృతంగా అరచింది గుడ్లగూబ. ఆ చెట్ల గుంపులోంచి పైకిలేచి, ఈరిగాడి తల మీదుగా అరచుకొంటూ ఎగిరిపోయింది ఒక తీతువు.

"ఛీ పాడుముండ.... నీ నోట మన్నుకొట్ట... నా మీదుగా ఎగురుతావేటే?" తన కోపం అంతా తీతువు మీద చూపిస్తూ తిట్టిపోసాడు. పేరుకొన్న కోపం తీతువు మీద దింపుకొన్నాక వాడి మనసు కొంత చులకన పడింది. నోటిలో ఆరిపోయిన చుట్ట కొడి దులిపి, మళ్లా వెలిగించి గుండెల నిండా పొగ లాక్కుంటూ ఆలోచనలో పడ్డాడు.

ఆ రోజు పనిలోకి వస్తుంటే గుడిసె దాటి వీధిని పడేవరకు ఎల్లి చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి.

"మావా! సూదిమందు ఏత్తేకాని చిట్టికి జొరం తగ్గదంటున్నాడు డాకటేరు. ఈఏల సేతిలో పడింది కూంతా ఆ ఎర్రయ్య కల్లుకొట్టుకాడ సెల్లు బెట్టిరాక, తిన్నగా ఇంటి కాడకి రా.... నిన్నటేలనుంచి పిల్లదాని వోటం సూత్తుంటే నాకేటో భయంగా ఉండాది. పాలు కుడవదు. పలకరిస్తే ఊచులు సెప్పదు. ఇదే పాడుముండ జొరం వచ్చిపడ్డాదో" కంటతడి పెట్టుకుంటూ చెప్పింది ఎల్లి.

"అట్టాగేనేవే ఎల్లీ. ఈయాల సేతిలో పడ్డదంతా ఎంకటేసుడికి ముడుపు కట్టినట్టు అట్లాగే మూటకట్టి తెత్తా. అందల ఒక్క పైస ముట్టుకొంటే నాను సచ్చినంత ఒట్టు... సరిగంటే" అన్నాడు ఈరిగాడు నమ్మకంగా.

"ఒట్లు సత్తేలు ఎందుకులే... ఆపాటి బుద్దుంటే అదే పదేలు" అంది ఎల్లి.

పెళ్లాం ముందు అంత నమ్మికగా చెప్తున్నప్పుడు, ఒక్కొక్కరోజు ఏపాటి సొమ్ము చేతిలో పడకండానే గడిచిపోవచ్చు అన్న అనుమానమే కలుగలేదు ఈరిగాడికి. వాడు చేస్తున్న నౌకరీ అటువంటిది. సొమ్ము చేసుకోడానికి దానిలో ఉన్న అవకాశాలూ అటువంటివి.

ఎందుకూ పనికిరాడనుకొన్న ఈరిగాడికి పండులాంటి ఆ నౌకరీ దొరికింది అని విన్ననాడు ఈరిగాడి తండ్రి ఎంపటాయి ఆకాశమంత ఎత్తు ఎగిరి కొడుకుని వాటేసుకొన్నాడు.

"ఎంత అద్దుట్టరంరా ఈరిగా! నిత్తె పంటనాంటిదిరా నీ ఉద్దోగం. ఒడుపుగా వేసుకుపోయేవంటె. బంగారం గోడలు పెట్టొచ్చురా.... మిద్దెలు, మేడలు కట్టొచ్చురా" అంటూ సంబరపడిపోయాడు.

ఈరిగాడు పట్టం వచ్చి నౌకరీలో చేరేక తండ్రి ఆశించినట్లు మేడలు, మిద్దెలు కట్టకపోయినా తిండికి, గుడ్డకి ధోకా లేకుండా, రాత్రిపూట నోటిలో చుక్కకి లోటు కాకుండా యధాశక్తిని సంపాదిస్తూనే ఉన్నాడు.

రేపు కోసం ఈ రోజు కూడపెట్టడం, ముందు ముందు పుట్టబోయే వాళ్ళ కోసం ఆస్తి పాస్తులు సంపాదించి ఉంచడం అన్న మాటల మీద ఈరిగాడికి అట్టే నమ్మకం లేదు.

"తెల్లారి లేసేసరికి ఏరు బతికుంటారో, ఏరు సస్తారో అన్నట్టుంది పెపంచం. ఇట్టాటి సమయంలో ఎప్పటికో అవుచరం పడ్తదని, ఇప్పుడు నోరు కట్టుకోవడం, మనసు సంపుకోడం, బుద్ధినేనిపనే ఎల్లీ! ఉన్నది ఈఏలే అనుబవించురా పిచ్చోడా... రేపు వస్తాదో రాదో ఏరి కెరుక? అన్నాట్ట ఏడో గొప్పోడేలే... నిజంగా నచ్చులు ఇలువ సేసే మాట అది. ఎల్లీ! నీకెందుకే అంత బయం! ఆ సావులమ్మ సల్లగ సూడాలికాని మనకి డబ్బుకి నోటేటే" అనేవాడు ఈరిగాడు.

అతడితోపాటు నౌకరీ చేస్తున్న వీరబాహు సలక్షణంగా సొమ్ము గడించి పెళ్లానికి, పిల్లలకి సరకు సప్పరీ చేయిస్తున్నాడనీ, గుడిసె పీకి మిద్దిల్లేసేడనీ, ఈరిగాడు చేతిలో పడ్డది ఏ రోజుకి ఆరోజు కల్లంగడి దగ్గర చెల్లు పెట్టుకు వస్తున్నాడనీ, పెళ్ళాం ఎంతగా సాధిస్తున్నా ఈరిగాడు అదేం పట్టించుకోడు. డబ్బుపట్ల బ్రతుకుపట్ల, వాడి వేదాంతం వాడిది.

రాత్రంతా కళ్లముందే గడిచిపోయి తెల్లవారబోతున్నా మనిషన్నవాడు, దరిదాపుల్లోకి వస్తున్న జాడలేదు. రోజూ ఆవేళ చేతిలో కనీసం నాలుగైదు రూపాయలైనా గలగల్లాడేవి. (నోట్లు అయితే చప్పుడు చెయ్యవనుకోండి). ఆ రోజు నిజంగా ఈరిగాడికి అవసరం పడినరోజు. పెళ్లాం చేతిలో డబ్బు పెట్టకపోతే ఆమె ముందు దోషిలా నిలవవలసి వచ్చినరోజు. అంతవరకు ఒక్క పైసా అయినా వాడి కంటపడలేదు. వీరబాహు డ్యూటీ మొదలవుతుంది. కాలం అలా గడిచిపోతుంటే ఈలోగా ఎవరో ఒకరు వస్తారనే ఆశ కూడా మిగలకుండా పోయింది ఈరిగాడి మనసులో.

"ఈ రోజేటయింది... ఏటయింది?" అసహనంగా అనుకోసాగాడు. అలా నిలువు గుడ్లేసుకుని దారివంక చూస్తూ కూర్చోడంతో ఈరిగాడికి చెప్పలేనంత విసుగు కలిగింది. పుస్తకాల్లో ఆరోగ్యసూత్రాలు వల్లె వెయ్యడమే కాక, వాటిని 'ఆచరణలో పెడ్తున్న మనుషులమీద, రాత్రి పగలు అని లేక లేబరేటరీల్లో కూర్చుని రానున్న జబ్బులకు కూడా మందులు కనిపెడ్తున్న సైంటిస్టుల మీద, ఆదర్శాలంటూ ఆస్పత్రి గోడలమీదే కాపురాలు పెట్టుకొని, వార్డుల్ని, రోగుల్ని పక్షుల్లా పట్టుకొని, వేలాడే కొందరు డాక్టర్ల మీద పీకలమొయ్య కోపం ముంచుకొచ్చింది.

"వాడకో దాకటేరు. ఈడికో ఆసుపత్రి... దేశంలో మనుసులు పెరిగిపోతున్నారనీ, తిండి సాలడం లేదనీ, గోలపెట్టే పెబుత్వం పెజలు తగ్గడానికి ఏటిసేతున్నాదీ అంట?" పార్లమెంటులో ప్రజాశ్రేయస్సు కోసం, దేశ సౌభాగ్యం కోసం పాకులాడే సభ్యుడిలా సూటిగా ప్రశ్నించాడు ఈరిగాడు.

ఇంకో గంట గడిచిపోయింది దూరంగా కోడి కూసింది. తూర్పున పొడిచిన చుక్క పడమటికి వాలిపోయింది. అంతవరకు ఈరిగాడి మనసులో ఆశలా వదలలేక అక్కడే తచ్చాడుతున్న చిరువెన్నెల ఇంక లాభం లేదని గ్రహించి తను చల్లగా జారుకొని చీకటికి దారి ఏర్పరిచింది. ఆ కటిక చీకట్లో కళ్లు పొడుచుకొంటూ, ఆ చీకటికన్నా, తన మనస్సులోని ఆరాటంకన్నా నల్లగా ఉన్న తారురోడ్డు వంక అసహనంగా చూస్తున్నాడు ఈరిగాడు.

ఈరిగాడి చూపుల్లో అసహనం, అనుమానంగా మారింది. దూరంగా ఏదో ఆకృతి కదులుకొంటూ అటే వస్తున్నట్టు అన్పించింది. చేతిలో మూటలా ఏదో వస్తువు. నిదానంగా అటే చూసాడు ఈరిగాడు. ఆ వస్తున్న వ్యక్తి దారినబోయే బాటసారి కాదు. తెలిసిన వాళ్లెవరు చీకట్లో ఆ దారంత ప్రయాణం చెయ్యరు. దెయ్యాలు, భూతాలు అంటే నమ్మకం లేనివాళ్లు కూడా 'కీడెంచి మేలెంచు' అన్న ధోరణిలో అటు రావడం మానుకొంటారు.

ఆ వ్యక్తి భారంగా అడుగులు వేస్తూ అటే వస్తున్నాడు. ఈరిగాడి మనసులో నిలిచిన నలుసంత అనుమానం అతడు దగ్గరికి వస్తుంటే తొలిగిపోయింది. 'హమ్మయ్య!' అనుకున్నాడు, పెద్ద భారం తీరినవాడిలా గుండెల నిండ ఊపిరి పీల్చుకొంటూ, ఉట్టి చేతులతో ఇంటికి పోయి పెళ్లానికి సంజాయిసీ చెప్పుకోవలసిన పరిస్థితిని తప్పించినందుకు భగవంతుడికి మనసులోనే పదివేల నమస్కారాలు అందజేసాడు.

తేలికపడ్డ వాడి మనసులాగే ప్రకృతి కూడ రాగరంజితం అయింది. కారు చీకటిని తరిమికొట్టి వెలుగురేడు తన రాజ్యం స్థాపించడానికి వచ్చినట్లు తూర్పు దిక్కు ఎర్రబడింది. ఆ వచ్చేవాడు ఇంకొక అరగంట పోయి వస్తే ఆ సొమ్ము వీరబాహు చేతిలో పడి ఉండేది. ఈరిగాడు ఖాళీ చేతులతో ఇల్లు చేరవలసి వుండేది. వాడి అసమర్థతని ఎత్తి చూపుతూ పెళ్ళాం విడిచే సాధింపులకి వాడు గురికావలసి ఉండేది.

"ఎంతలో ఎంత పెమాదం తప్పోయింది!" అనుకున్నాడు ఈరిగాడు మెల్లగా తేరుకుంటూ.

ఆ వస్తున్న వ్యక్తి వాలకాన్ని బట్టి చూస్తే పరమ దరిద్రుడులా వున్నాడు. చేతిలో బరువు చూసినా అట్టే డబ్బు పలికేదిలా లేదు. అయినా ఈరిగాడు నిరుత్సాహపడలేదు. ఇటువంటి సమయంలో ధనవంతుడైనా, దరిద్రుడైనా సొమ్ముకి బేరం ఆడదు. ఎంతో కొంత చేతిలో పెట్టి పని గడుపుకోవాలనుకొంటాడు. అయినా ఈ ఏల జాలి, దయ అనుకొంటూ తను దిగి రాకూడదు. మామ్మూలంటే.... మామ్మూలే.... ఒక్క పైసా తగ్గినా పని జరగదని నికరంగా చెప్పేయాలి. ఎవరు మాత్రం కష్టపడకుండా ఊరికే ఇస్తారా? కష్టానికి తగిన ప్రతిఫలం ఆసించడంలో తప్పేముంది? వాడు దరిద్రుడు అయితే తను మాత్రం ధనవంతుడా? రెక్కాడితే డొక్కాడే రకమే తనుకూడా. ఈ డబ్బులు పట్టుకెళ్లి అక్కడ చేతిలో పోస్తే ఆ డాక్టరు మందిస్తాడు. లేకుంటే వచ్చినదారినే వెళ్లమంటాడు. ఎవరి అవసరాలు వారివి. దయ, జాలి అని కూర్చుంటే పనులు జరుగుతాయా?

మనసులోంచి మానవత, జాలి అనే పదాన్ని పూర్తిగా తుడిచిపెట్టి ఎదురుగా వస్తున్న ఆ వ్యక్తి దగ్గర ఎంత సొమ్ము గుంజవచ్చునా అనే ఆలోచనలో పడ్డాడు ఈరిగాడు. ఆ వ్యక్తి నెమ్మదిగా వచ్చి చేతిలోని బరువును ఈరిగాడికి రెండు గజాల దూరంలో నేల మీద పెట్టాడు.

యాంత్రికంగా డబ్బు కోసం చెయ్యి జాచాడు ఈరిగాడు. ఆ వ్యక్తి ఈరిగాడి కళ్ళల్లోకి జాలిగా చూశాడు. ఏదో చెప్పాలన్నట్లు పెదవులు కదిలించాడు. కాని అతడి నోటంట మాటరాలేదు. కళ్ళంట నీళ్ళు జిమ్మాయి. ఆ ముఖం పరిచితమైన ముఖంలా అనిపించింది ఈరిగాడికి. ఆ చిరుచీకట్లో పోలిక మాత్రం తిన్నగా తెలిసి రాలేదు. ఆ కళ్ళల్లోకి అలా చూస్తుంటే క్షణకాలం కిందట చేసుకొన్న నిర్ణయాలు ఆ కన్నీటిలా కరిగిపోయి ఆ స్థానంలో జాలి చోటు చేసుకోబోయింది. ఇంకో సమయంలో అయితే ఆ చూపులో వున్న బాధకి, దీనత్వానికి లొంగిపోయేవాడే ఈరిగాడు. అయ్యో పాపం, అని జాలిచూపేవాడే. కాని, ఆరోజు అతడి అవసరం అతడిది. తను ఇక్కడ జాలిపడితే అక్కడ తన మీద జాలి చూపి మందు పొయ్యడు డాక్టరు. ముందు చేతిలో సొమ్ముపెట్టు అంటూ మొండికేసి కూర్చుంటాడు.

ఆ వ్యక్తి మళ్లీ అదేవిధంగా ఈరిగాడివైపు చూసాడు. అప్పటికి మరికాస్త వెలుగు వచ్చింది. ఆ ఎదుట వున్న వ్యక్తి ఎవరో పోల్చుకున్నాడు ఈరిగాడు. అతడు తమ వీధిలో చివరగా ఉన్న కమ్మలపాక మారయ్య. బజారు వీధిలో చెప్పులు కుట్టుకొని బ్రతుకు లాక్కొస్తుంటాడు. నలుగురు పిల్లలు, పెళ్ళాం, తల్లీతండ్రీ అందరూ వాడి కష్టం మీద పడి తినేవాళ్ళే.

మారయ్య కొచ్చిన కష్టం మీద ఈరిగాడికి సానుభూతి కలిగింది. కాని అప్పట్లో అతడికి ఏ విధంగాను సహాయపడే స్థితిలో లేడు తను. అందుకే ముఖం తప్పించాడు. మనసులోకి వచ్చిన ఆర్ద్రభావాల్ని ఒక్క తల ఊపుతో చెదరగొట్టాడు. మారయ్య ఎవరో తెలియనట్లే నటిస్తూ, "సెప్తుంటే ఇనిపించలా... ముందు డబ్బు సేతిలోపెట్టి..." అన్నాడు లేని కరకుతనాన్ని కంఠంలో తెచ్చుకుంటూ.

మారయ్య నెమ్మదిగా "ఈరిగా" అన్నాడు.

ఈరిగాడి మనసుకి బాణంలా గుచ్చుకుంది మారయ్య పిలుపు. వాడు తన్ను పోల్చుకున్నాడు. ఒక వూరివాళ్ళం, ఒక వాడవాళ్ళం. కష్ట సమయంలో ఆపాటి ఆదుకోకపోతే ఎలారా? అన్నట్లు ఉంది ఆ పిలుపు.

ఇంకో సమయంలో అయితే తను ఆదుకొనేవాడే. తను మరీ అంతలా డబ్బుకి చచ్చే మనిషి కాదు. అలాగే అయితే తండ్రి అన్నట్లు ఈపాటికి బంగారు గోడలు పెట్టేవాడు. మేడలు మిద్దెలు కట్టేవాడు. ఇంతవరకూ ఎవ్వరినీ నిర్బంధించి సొమ్ము పుచ్చుకోలేదు. తన మామ్మూలు ఇంత అని చెప్పేవాడు. ఇచ్చేవాళ్లు పూర్తిగా ఇచ్చేవారు, లేనివాళ్లు తమకు తోచింది చేతిలో పెట్టి వెళ్లేవారు. అలాటివాళ్లు ఎంత ఇచ్చారని చూసుకోకుండానే జేబులో వేసుకొనేవాడు... తను రేటు దిగలాడుతున్నాడనీ మిగిలిన వాళ్ళ కూట్లో దుమ్ము కొడ్తున్నాడనీ వీరబాహు దెబ్బలాటకి దిగేవాడు.

చేతకానివాడి మాటకి, ఆలోచనకి విలువలేదు. ఆరోజు మారయ్యకి తను ఏ విధంగానూ సహాయపడలేదు. అందుకే చలనం లేకుండా రాతిబొమ్మలా అలా నిలబడి పోయాడు ఈరిగాడు.

మారయ్య నెమ్మదిగా పైమీది గుడ్డ చివర ముడి విప్పాడు. అందులో డబ్బులు ఉంటాయనుకొన్నాడు ఈరిగాడు. అతడి తెలివితక్కువని పరిహసిస్తున్నట్లు తెల్లని ఉప్పు బయటపడింది.

"ముందు డబ్బులు తియ్యి' విసురుగా కర్రని నేలకి తాటిస్తూ అన్నాడు ఈరిగాడు.

ఆ కర్ర తాకినచోటనే నేల మీద చతికిలపడ్డాడు మారయ్య. నెమ్మదిగా కాళ్ళ ముందున్న గుడ్డమూటని సడలించాడు. ఆ గుడ్డల మధ్యగా నిశ్చలంగా పడి ఉన్న పసిదాని ముఖం మీద అప్పుడే పొడుచుకొచ్చిన తొలి వెలుగురేఖ పడింది.

పాపవంక పిచ్చివాడిలా చూసాడు ఈరిగాడు.

'చిట్టీ' అంటూ ఓ గావుకేక పెట్టి నేల కూలబడ్డాడు. అతడి చేతిలో కర్ర నేల జారింది. అతడి కళ్లవెంట నీళ్లు ధారకట్టాయి. ఆ తండ్రీ బిడ్డల వంక జాలిగా చూసాడు మారయ్య.

కర్ర తాటిస్తూ రంగంలోకి వచ్చాడు వీరబాహు. "ఎల్లరా ఈరిగా నీ డూటీ అయిపోనాది" అంటూ.

ఎదురుగా గుడ్డల్లో పసిబిడ్డ... అప్పుడే బ్యాంకులోంచి తెచ్చిన కొత్త నోటులా కన్పించింది వాడికి.

"ఈరోజు ఏరి ముఖం చూసి లేచానో.... ఇట్టా పనిలోకి అడుగు పెట్టేతలికి అట్టా బోణీ బేరం" సంతోషంగా ఊపిరి పీల్చుకొన్నాడు వీరబాహు.